రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలి







మడకశిర: జడ్జి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం, హిందూపురంలో మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తులు, పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, పోలీసులు

- న్యాయమూర్తులు కంపల్లె శైలజ, శ్రీధర్, రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: వాహనదారులు రోడ్డు నిబంధనలను విధిగా పాటించాలని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మోటారు వాహనాల చట్టంపై వాహనదారుల్లో అవగాహక కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని న్యాయమూర్తులు కోర్టు ప్రాంగణంలో ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గాలంటే వాహనదారులు ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించడమే కాకుండా వాహనాలు తగిన కండీషన్‌లో ఉంచుకొని నడపాలన్నారు. వాహనదారులుడు డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ, బీమా ఇతర పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహనం నడిపేటప్పుడు కుటుంబీకులను గుర్తు చేసుకొని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు. వాహనదారులు ప్రమాద రహిత సమాజం స్థాపన కోసం సహకరించాలన్నారు. ఈ అవగాహన సదస్సులో వివిధ కోర్టుల సిబ్బంది, న్యాయవాదులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

పెనుకొండ: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ వాడి ప్రాణ రక్షణ పొందాలని మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్, జూనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప పేర్కొన్నారు. పట్టణంలో గురువారం న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకం- వన్‌వే వాక్ అను కార్యక్రమంలో భాగంగా న్యాయమూర్తులు పట్టణంలో తెలుగు తల్లి సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ద్విచక్రవాహనాల్లో వెళ్లే వ్యక్తులు ఖచ్చితంగా హెల్మెట్ వాడాలన్నారు. హెల్మెట్ లేకుంటే చిన్న ప్రమాదం అయినా ప్రాణాంతకంగా ఉంటుందన్నారు. రోడ్డు పక్కన నడిచే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మదన్‌మోహన్ రెడ్డి, సుదర్శనరెడ్డి, శరత్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, పీఓ హఫీజ్, పోలీసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన..

మడకశిర: పట్టణంలో గురువారం జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు పెట్టుకుని వాహనాలను నడపాలని సూచించారు. చాలామంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు పెట్టుకోకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైనట్లు గుర్తు చేశారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు రాజ్‌కుమార్, మనోహర్, న్యాయవాదులు క్రిష్టప్ప, గోపినాథ్, బాబునాయక్, కోర్టు సిబ్బంది ప్రవీణ్, జయకృష్ణ, కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం



బెంగళూరు విమానాశ్రమంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న వేణురెడ్డి



వైఎస్ భారతీరెడ్డితో మాట్లాడుతున్న నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతీరెడ్డిలను హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి బెంగళూరు విమానాశ్రయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. బెంగళూరు నుంచి విజయవాడకు బయల్దేరుతున్న సమయంలో కలిశారు. హిందూపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, అధికారపార్టీ నాయకులు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇందుకు జగన్‌మోహన్ రెడ్డి పార్టీ నాయకులందరూ కలిసికట్టుగా ఉంటూ పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా నిలిచి పోరాడుతుందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వారే తగిన సమయంలో సరైన బుద్ధి చెబుతారని చెప్పినట్లు తెలిపారు.

వైభవంగా ఉట్ల పరుష



ఉట్లమాను పోటీలను తిలకిస్తున్న జనం

పరిగి: బాలిరెడ్డిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉట్ల పరుష గురువారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన ఉట్ల పరుషను తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. యువకులు ఉట్లమాను ఎక్కడానికి ప్రయత్నించడం, పై నుంచి పోస్తున్న బురదతో పోటీదారులు కిందకు జారిపోవడం వంటివి వీక్షకుల్లో ఆసక్తి రేకెత్తించాయి.

పెద్ద దాళవాటంలో రథోత్సవం..

కర్ణాటక ప్రాంతమైన పెద్ద దాళవాటంలో గురువారం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గతే ఏకాదశి నుంచి ఇప్పటి వరకూ కొత్తగా పెళ్లి చేసుకున్న దంపతులు రథోత్సవానికి హాజరై బొరుగులు చల్లి తమ మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడ ప్రత్యేకత.

సోమందేపల్లి: తొలి ఏకాదశి సందర్భంగా కదిరేపల్లి లక్ష్మి నరసింహస్వామి ఆలయం వద్ద ఉట్ల పరుష గురువారం వైభవంగా జరిగింది. యువకుల ఉట్టి కొట్టడానికి పోటీ పడ్డారు. పరుషకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీలు సుభాషిణి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూతప్ప ఉత్సవాలు

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా భూతప్ప ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భూతప్ప వేషధారణలో సాంప్రదాయక నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. భూతప్ప గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రసాదాన్ని స్వీకరించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.



భూతప్ప వేషధారణలో భక్తులు

పథకాలపై అవగాహన కల్పించాలి

మడకశిర: వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యాశాఖ, వ్యవసాయ శాఖలపై లోతుగా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సబ్సిడీ పథకాల వివరాలను రైతులకు తెలియజేయాలని కోరారు. ఎంపీపీ కవిత మాట్లాడుతూ అన్నిశాఖ అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ, వైస్ ఎంపీపీలు లాయర్ మూర్తి, శ్రీరామరెడ్డి, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

వైభవంగా ఆంజనేయ స్వామి జాతర



పాల కావళ్లను మోసుకొస్తున్న దృశ్యం



అలంకరణలో ఆంజనేయుడు

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామంలో వెలసిన గుజ్జారి ఆంజనేయ స్వామి, కోదండ రామ స్వామి సమేత జాతర గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి అభిషేకం, అంకురార్పణ, కలశ స్థాపన పూజలు నిర్వహించారు. గుడి కట్టు పెద్దలు బండికారులు, జలదేనవర గౌడలు, అశువనవ గౌడలు తదితర అన్నదమ్ములు పాల్గొన్నారు. ఈనెల 19న పిడి హారతి, భూత బలి సేవలు, 20న చిన్న రథోత్సవం, అన్నసంతర్పణ, శ్రీరామ కల్యాణోత్సవం, 21న స్వామి బ్రహ్మ రథోత్సవం, చివరి రోజు 21న కేశ ఖండన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి జాతర

పావగడ: తాలూకాలోని మీనకుంటపల్లి గ్రామంలో గురువారం లక్ష్మీ నరసింహస్వామి జాతర ప్రారంభమైంది. లక్ష్మీ నరసింహస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఇలవేల్పుగా కొలిచే నరసింహ స్వామి జాతరను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాలే కాకుండా సమీప ఆంధ్రకు చెందిన వందలాది మంది భక్తులు, మహిళలు తరలి వచ్చారు. ఇదిలా వుంటే గ్రామానికి సమీపంలోని రాంపేటె గ్రామం నుంచి జాతరకు తరలి వచ్చే పాల కావళ్లు ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. స్వామి భక్తులు మూడు రోజులుగా ఉపవాసం ఉండి భక్తిశ్రద్ధలతో మూడు పాల కావడిలను జాతరకు తీసుకు వచ్చి ఆలయంలో ప్రదర్శించారు. అప్పటికే పాలు పెరుగుగా మారడంతో ఆ పెరుగును దేవుడి ప్రసాదంతో కలిపి భక్తులకు అందిస్తారు. అంతే కాకుండా వర్షాలు సకాలంలో కురిసి పశువులకు మేత, తాగునీరు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నారు. ఆలయం చుట్టూ ఎద్దల బండ్లు, ట్రాక్టర్లు, గొర్రెలు, పశువులను మూడు సార్లు తిప్పారు.

ముక్కాంజనేయస్వామి జ్యోతుల ఉత్సవం

రొద్దం: ఆర్ కుర్లపల్లి గ్రామ సమీపాన వెలసిన ముక్కాంజనేయస్వామికి గురువారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం అంజన్నకు ప్రత్యేక అలకంరణ అనంతరం పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున జ్యోతలతో ఆలయం చుట్టు మూడు సార్లు ప్రదక్షిణలు చేసి జ్యోతులను స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్ట పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ మంత్రి పర్యటన



పెద్దిరెడ్డిపల్లిలో చిన్న సిద్దప్పను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: మండలంలో గురువారం మాజీ మంత్రి, పెనుకొండ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ పర్యటించారు. తొలుత మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న మైనార్టీ నేత మున్నా అలియాస్ జియావుల్లాను ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పెద్దిరెడ్డిపల్లిలో నాగమణి, శ్రీదేవి, చిన్న సిద్దప్ప ఇళ్లకు వెళ్లి వారి పరామర్శించారు. ఆమె మండల, ఆయా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి



కమిషనర్‌తో కలిసి తనిఖీలు చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి కార్యాలయంలోని అన్ని శాఖలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొందరు ఉద్యోగులు సరైన సమయంలో కార్యాలయానికి రాలేదని, కొందరు హాజరుకాకపోయినా సంతకాలు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించినప్పుడే గౌరవ మర్యాదలుంటాయన్నారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీ

మడకశిర: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రిలో సమయానికి డాక్టర్లు అందుబాటులో లేకపోవడం అసహనం వ్యక్తం చేశారు. సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైన ఓ డాక్టర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు డాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

గౌరవ వేతనం పెంచాలి..

స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల గౌరవ వేతనం పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు 17వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుభద్ర వినతిపత్రం అందించారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు నామమాత్రంగా గౌరవ వేతనం అందిస్తున్నారని తెలిపారు. కౌన్సిలర్లకు కేవలం నెలకు రూ.2,500 మాత్రమే గౌరవ వేతనం వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గౌరవ వేతనం పెంచేలా చూడాలని కోరారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ బంగారమ్మ

గుడిబండ: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ఎంపీడీఓ బంగారమ్మ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలును నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి పౌరుడు మొక్కలు పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ నారాయణప్ప, ఈఓఆర్డీ నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఎస్పీ



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ రత్న

పెనుకొండ: పట్టణంలోని మంత్రి సవితను ఆమె కార్యాలయంలో గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీ రత్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్పీ శాంతి భద్రతల విషయంపై మంత్రి చర్చించారు. అంతకు ముందు మంత్రి దర్గీపేట ఆంజనేయస్వామి ఆలయం ముందు ఉట్ల పరుషకు హాజరయ్యారు.

చెరువు మరువల మరమ్మతుకు చర్యలు తీసుకోండి



రొద్దం పెద్దచెరువు మరువను పరిశీలిస్తున్న మంత్రి సవిత, అధికారులు

రొద్దం: రెండేళ్ల కిత్రం భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువు మరువలకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను శాఖ మంత్రి సవితమ్మ ఆదేశించారు. రొద్దం మండలం కోగిర, రొద్దం పెద్ద చెరువులను మంత్రి గురువారం పరిశీలించారు. వర్షానికి పూర్తిగా దెబ్బతిన్న చెరువు మరువలను త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం పెద్దకోడిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఈఈ గంగాధర్, డీఈ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ అశ్వత్థనారాయణ, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు టైలర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు



హెచ్ఎం విశ్వనాథ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్ హిందూ ఉపాధ్యాయ సమితి వ్యాస–2024 పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఉపాధ్యాయులు హెచ్ఎం విశ్వనాథ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలన్నారు. విద్యాభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మట్టి దిబ్బల తొలగింపు



కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కర్

అమరాపురం: స్థానిక శిరా రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డుపై వేసిన మట్టి దిబ్బల తొలగింపునకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్మికులు మట్టి దిబ్బలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భాస్కర్ కాలనీలోకి వెళ్లి రోడ్లను పరిశీలించారు. రోడ్డుపై ఎవరు అడ్డంగా మట్టి కట్ట వేయవద్దని సూచించారు. మట్టి వేయడం వలన మరుగు నీరు కిందకు పోకుండా నిలుస్తుందన్నారు. దోమలు వృద్ధి చెంది రోగాలు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం పంచాయతీ కార్మికులు రోడ్డును శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్, సర్పంచ్ వాగేష్, ఎంపీటీసీ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహాల తనిఖీ



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహరావు

అమరాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలిక, బాలుర వసతి గృహాలను గురువారం ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహరావు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మరుగుదొడ్లు సక్రమంగా ఉన్నాయా? ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుకు బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం హాజరు పట్టికను పరిశీలించారు. వీరితో పాటు మెట్రీన్ మాధవి విద్యార్థులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

పాడుబడిన బావిలో పడిన వృద్ధుడు

హిందూపురం అర్బన్ : పట్టణ శివారులోని సీపీఐ కాలనీ సమీపంలోని పాడుబడిన బావిలో గురువారం రాత్రి 8:30 గంటల సమయంలో కొండప్ప అనే వృద్ధుడు పడిపోయాడు. అయితే అతను గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు గుర్తించి వెంటనే పోలీసులు, ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని 50 అడుగులకు పైగా లోతుగా ఉన్న బావిలో పడిన ఆ వృద్ధుడిని కాపాడారు. సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బందికి కాలనీ వాసులు, వృద్ధుడి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి

గోరంట్ల: దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శృతి బీసీ హస్టల్ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక బీసీహాస్టల్‌లో సీజనల్ వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రమణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలి

చిలమత్తూరు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేల్లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేష్, రామచంద్రం, మంజునాథ్, నరసింహ, గోపాలప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు బీసీజీ టీకాలు

గుడిబండ: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ సౌందర్య పేర్కొన్నారు. గురువారం హిరేతుర్పి సచివాలయ పరిధిలోని వృద్ధులకు ఆరోగ్య సిబ్బంది టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 3,915 మంది వ్యాక్సిన్ వేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భ్రమరాంబ, జ్యోతి, పద్మావతి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ ఎన్నిక

లేపాక్షి: లేపాక్షిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా వసంత్, కార్యదర్శి పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా నితీన్, ప్రశాంత్, త్రిదేవ్, చరణ్, సహాయ కార్యదర్శులుగా అభి, రోహిత్, గణేష్, మునాఫ్, హరీష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరసింహమూర్తి, దేవరాజ్, కలందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

హిందూపురం టౌన్: విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో బోధించాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని డీవైఈఓ రంగస్వామి సూచించారు. గురువారం పట్టణంలోని ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని డీవైఈఓ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాలకు చెందిన పలు మండలాల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఏఎంఓ మహేంద్రరెడ్డి, ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, హెచ్ఎం సామ్రాజ్యం, మాస్టర్ ట్రైనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

హిందూపురం: ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతులకు అందించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాచపల్లి సిద్ధారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు అన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై హిందూపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం, సీఐటీయూ నాయకులు జయరామిరెడ్డి, శివశంకర్, వీఆర్ రాము, అత్తార్ బాబా, రామకృష్ణ, కేవీపీఎస్ నాయకులు జ్యోతమ్మ, ఉమర్‌ఫరూక్ పాల్గొన్నారు.

జీఓ 107, 108లను రద్దు చేయాలి

హిందూపురం టౌన్: 107, 108 జీఓలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశం నిర్వహించి, మాట్లాడారు. యువగళం పాదయాత్రలో టీడీపీ నేత, మంత్రి నారా లోకేష్ టీడీపీ అధికారంలోకొస్తే జీఓలను రద్దు చేసే బాధ్యత నేను తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు కొత్త వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను కేటాయించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, హుసేన్, ఆఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని ఆదుకున్న పోలీసులు



వృద్ధుడికి సపర్యలు చేస్తున్న పోలీసులు

లేపాక్షి: వారం రోజులుగా తిండి తిప్పలు లేకుండా రోడ్డుపై అనాథగా ఉన్న 75 సంవత్సరాల వయసున్న ఓ వృద్ధుడిని లేపాక్షి పోలీసులు ఆదుకున్నారు. వివరాలు.. లేపాక్షి మండలం చోళసముద్రంలోని జాతీయ రహదారి పక్కనే వారం రోజులుగా ఓ వృద్ధుడు నీరు, భోజనం లేక ఉండిపోయాడు. విషయాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో గురువారం ఉదయం రెవెన్యూ అధికారులతో కలసి ఎస్ఐ గోపి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. వృద్ధుడికి భోజనం తినిపించి, వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. అయితే వృద్ధుడు మాట్లాడలేకపోవడంతో 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో పోలీసులు వివరాలు రాబట్టారు. తన పేరు చిట్టెప్ప అని, కర్ణాటకలోని మంచేపల్లి గ్రామానికి చెందిన వాడినని వృద్ధుడు చెప్పుకొచ్చాడు. అయితే ఆయన చాలా నీరసంగా ఉండడంతో పూర్తి వివరాలు తెలపలేకపోయినట్లు సమాచారం.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు మండ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యుడు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

24న చిలమత్తూరులో..

చిలమత్తూరు: ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

దాడులను అరికట్టాలి

రొళ్ల: పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు రషీద్‌పై వేట కొడవలితో దాడి చేసి చంపేయడం దుర్మార్గమని జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను అరికట్టడంలో విఫలమైన రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత రాజీనామా చేయాలన్నారు. రషీద్‌పై దాడి చేసిన వ్యక్తిని వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుని చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎంఈఓగా నాగరాజు

చిలమత్తూరు: మండల విద్యాధికారి– 1 గా నాగరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓ–1 పద్మప్రియ సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జ్‌గా నాగరాజు బాధ్యతలు తీసుకున్నారు.

సస్యరక్షణతోనే తెగుళ్ల నివారణ

అమరాపురం: సస్యరక్షణతో వక్క తోటల్లో తెగుళ్లను నివారించుకోవచ్చని డివిజనల్ హెచ్ఓ చిన్న రెడ్డయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని తమ్మడేపల్లి, అమరాపురం, హలుకూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వక్క తోటలను పరిశీలించారు. వక్క చెట్లకు ఆశించిన తెగుళ్లపై ఆరా తీశారు. రైతులు చిన్న మొక్కలను నాటినపుడు తప్పకుండా సస్యరక్షణ చేపట్టాలన్నారు. వక్క మొక్కల్లో అధికంగా రసం పీల్చు పురుగుల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. దీంతో ఆకులు ఎరుపు రంగులోకి మారి పండు కావడం జరుగుతుందన్నారు. దీంతో దీని నివారణకు మొదట 2 ఎంఎల్ రీజెంట్ మందును లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. వారం రోజుల తరువాత బఫ్రీజెన్ 1.5 ఎంఎల్ మందును లీటర్ నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఆకుమచ్చ తెగులు ఆశించిన వాటికి బాన్ మందును లీటర్ నీటికి ఒక గ్రాము కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ మంజునాథ, రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అమరాపురం: మద్దనకుంట చెక్‌పోస్టు వద్ద గురువారం ఎస్ఐ జనార్దన నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక బార్డర్ ఉండటంతో అక్రమంగా మద్యం, గుట్కా సరాఫరా చేస్తే ఉపేక్షించేది లేదని వాహనదారులకు హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఆర్సీలను పరిశీలించారు. ప్రతి వాహనదారుడు వాహనం ఆర్సీ కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏఎస్ఐ రామంజనేయులు పోలీసులు పాల్గొన్నారు.